# పడకకుర్చీ

-జె.మాలతి

"తాతయ్యా! గౌరి నీ స్నానానికి నీళ్లు పెట్టింది" అరిచాడు రవి.

"ఇదిగోరా తువ్వాలు తీసుకుని వస్తున్నాను"

"అమ్మా" అన్న తాతయ్య అరుపుతో ఇంట్లో అందరూ అక్కడికి వచ్చారు. వేడినీళ్లలో కుడిచేతివేళ్లు మునిగి ఎర్రబడ్డాయి.

"ఏమిటి? ఏమయ్యింది? గౌరీ చెప్పనక్కర్లేదా నీళ్లు వేడిగా ఉన్నాయని" కసిరాడు కృష్ణ.

"సల్లనీల్లు ఇంకా పోయలేదు. మళ్లీ తవురిక్కూడా స్టవ్వుమీద నీల్లు ఎడదామని గిన్నట్టుకు బేగి ఎల్లినాను. వచ్చి బకెట్లో సల్లనీల్లు పోదామని. నానొచ్చేతలికే తాతగోరు సెయ్యెట్టేసినారు" గౌరి పాపం సంజాయిషీ చెప్పకుంది. కృష్ణ ఫ్రిజ్ వాటర్ తెచ్చి తండ్రి చేతిమీద మళ్లీ మళ్లీపోసి బర్నాల్ రాసాడు.

"ఇక ఇవ్వాళ్టికి స్నానం వద్దులెండి. లోపలికి వచ్చి కూర్చోండి" అని తండ్రిని లోపలికి తెచ్చి కుర్చీలో కూర్చోబెట్టాడు.

సత్యవతమ్మ భర్త చేతిని పుస్తకంతో విసురుతూ కూర్చుంది 'పొద్దున్న లేచి ఎవరి ముఖం చూసారో' అంటూ.

కోడలు ప్రియ చల్లటి జ్యూస్ తీసుకువచ్చి అత్తగారికిచ్చింది మామగారికి తాగించేందుకు. సత్యవతమ్మ పడుతుంటే అవధాన్లగారు మెల్లగా త్రాగుతున్నారు. రవి, దీప గాభరాగా తాతయ్యవైపు చూస్తున్నారు. ఒక పావుగంటలో కొంచెం గాభరా తగ్గగానే స్నానానికి కొడుకు, వంట చేయడానికి కోడలు, పనులు చూడడానికి గౌరి లోపలకు వెళ్లారు. సత్యవతమ్మ 'మజ్జిగ చిలికి వెన్న రాస్తానుండండి' అంటూ తను కూడా వంటింట్లోకి వెళ్లింది. రవి, దీప తాతయ్య చెరోవైపూ మొహంలో మొహం పెట్టి "ఇప్పుడెలా ఉంది తాతయ్యా" అని అడిగారు.

అవధానిగారు చిరునవ్వు నవ్వారు. తాతయ్య నవ్వగానే తేరుకుని దీప నోట్లో వేలేసుక్కూర్చుంది. రవి వంటింట్లోకి వెళ్లి బాటిల్‌తో ఫ్రిజ్ వాటరూ, బర్నాలు తెచ్చి తండ్రి చేసినట్లే చన్నీళ్లు వేళ్లమీద పోసి బర్నాలు పూసాడు.

'వేడి నీటిలో చేతులెందుకు పెట్టావు తాతయ్యా?" అడిగాడు రవి. "కాల్తాయని తెలుసుకదా. మరచిపోయి పెట్టేసావా?"

"కాదురా..బాల్చీ అంచున కండచీమ ఒకటి ఉంది. బాల్చీ లోపల వేడినీళ్లు పొయ్యగానే అది గాబరాపడి అటూ ఇటూ వెళ్తోంది. నీళ్లు వేడికదా అందులో చీమ పడితే చస్తుందని దాన్ని పైకి తియ్యబోయాను"

నోట్లో వేలు చటుక్కున పైకి తీసి "చీమ చచ్చిపోయిందా తాతయ్యా" అంది గబుక్కున దీప. దానికి ఏడేళ్లేగానీ నోట్లో వేలేసుకుని అలవాటు పోలేదు. చదువు పని లేకపోతే అలా వేలేసుకుని కూర్చుంటుంది.

"దాన్ని రక్షిద్దామనేగా చూసాను. దాన్ని తియ్యబోతుంటే నావేళ్లు నీళ్లకు తగిలాయి. ఎడం చేత్తో దాన్ని బయటకితీసి పడేసాను."

"అయితే అది చావలేదా?" అంది దీప.

"ఊహూ... గబుక్కున బయటకెళ్లిపోయింది" తాతయ్య నవ్వుముఖంలో చీమను రక్షించాననే తృప్తి మెరిసింది.

"చీమను కాపాడదామని నువ్వు వేళ్లు కాల్చుకున్నావా?" తాత వేళ్లకింకా బర్నాలు రాస్తూనే అడిగాడు రవి.

"ఆ..వేళ్లు కొంచెం ఎర్రబడ్డాయి. చీమకేమీ అవలేదు. పాపం చీమ.... చిన్న ప్రాణం కదురా. అది నీళ్లల్లో పడి చేస్తే చాలా బాధపడేవాడ్ని. ఈ పాటి మంటకేంలే" అన్నారు అవధాన్లగారు.

'తాతయ్య... చీమని కూడా ఎంత దయగా చూసాడు. అసహాయ స్థితిలో ఉన్న వారికి సహాయపడాలన్నమాట' అనుకున్నాడు రవి.

"అమ్మో..." అనే అవధాన్లగారి కేకతో ఇంట్లో సభ్యులంతా వరండాలోకొచ్చారు.

ఈసారి ఏటయినాదో ఈ తాతగారు ఒక్కాడ కూకోరు. ఏదో ఒకటి పితూరీలు చేస్తుంటారు అంటూ గౌరి కూడా వచ్చింది.

ఆసరికే కృష్ణ పడక బట్ట చిరిగి కిందపడ్డ తండ్రిని లేవనెత్తుతున్నాడు. ప్రియ కూడా అతనికి సాయం చేస్తోంది.

"ఆ బట్ట చిరుగుపట్టింది. దానిలో కూర్చోవద్దంటే వినరేం. ఇప్పుడు పూర్తిగా చిరిగిపోయి కిందపడ్డారు. ఇంకా నయం కాలో చేయో విరగలేదు. ఎక్కడ మోసింది నాన్నా?" అంటూ తండ్రిని మంచంమ్మీద కూర్చోబెట్టాడు.

"దెబ్బేం తగల్లేదులేరా" అంటూనే నడుం రాసుకోసాగారు అవధాన్లగారు.

"ఉండండి. పెయిన్‌కిల్లింగ్ టాబ్లెటిస్తాను. అలా పడ్డప్పుడు దెబ్బ తగలకుండా వుండదు" అని కృష్ణ టాబ్లెట్, ఆయింట్‌మెంట్ బైటికి తీసాడు. ప్రియ నీళ్లు తెచ్చి ఇస్తే టాబ్లెట్ వేసుకున్నారు అవధాన్లగారు.

"నేను రాస్తాను తేరా?" అని సత్యవతమ్మ ఆయింట్‌మెంట్ చేతిలోకి తీసుకుని భర్త నడుంకి రాస్తోంది.

"ఇంకొంచెం కింద. ఆ...అక్కడ...అక్కడ బాగా మోసింది."

"ఆ కుర్చీలో కూర్చోవద్దని కదా అందరం అంటుంట. వినరుకదా. ఇప్పుడిలా... డాక్టర్ దగ్గరకు వెళ్దామా?"

"ఎందుకే? పొద్దునే లేచేసరికి తగ్గిపోతుంది."

"ఏం తగ్గడమో ఏమో?" ఆవిడ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"ప్రతిదానికీ కళ్లనీళ్లేనా? ఏం నొప్పిలేదు. ఇక రాయకు తగ్గిపోతుంది. చూడెలా నవ్వుతున్నానో" అంటూ రవివైపు తిరిగి పెద్దగా

నవ్వారాయన. నోట్లో వేలు ఊడదీసి హాల్లోనుంచి చిన్నస్టూలు తెచ్చింది దీప. దానిమీద కూర్చుని టీవీ చూస్తోందా పిల్ల.

"తాతయ్యా! దీనిమీద కూర్చో. అప్పుడు నువ్వు పడిపోవు"

"తాతయ్యా... నా కుర్చీ తెచ్చాను. దీనిమీద కూర్చో. ఇకపడిపోవు" అంటూ తను కూర్చుని చదువుకునే ప్లాస్టిక్ కుర్చీ తెచ్చాడు రవి.

"బంగారుకొండలురా మీరు. అందాకా ఇలా మంచంమ్మీద నిద్ర పోతా. తరువాత వాటిమీద కూర్చుంటా. ఒసే...సత్యవతీ! నువ్వు వీళ్లకి ఏ చక్కిలాలో చేసి పెట్టవే. తింటూ చదువుకుంటారు" మనవల మీద ప్రేమాతిశయం ముప్పిరిగొనగా ముచ్చటపడ్డారు అవధానిగారు.

సాయంత్రం టీవీ చూస్తున్నప్పుడు తన స్టూలుమీద తాతయ్య కూర్చుంటారేమోనని దీప ఎంతో ఆతృతగా చూసింది. కానీ తాతయ్య రవి ఇచ్చిన కుర్చీలో కూర్చోడంతో బాధపడింది.


'తాతయ్యకు అన్న అంటే ఇష్టంకానీ నేనంటే ఇష్టంలేదు" అని విచారంగా నోట్లో వేలు బిగించింది.

"అంత చిన్న స్టూలు తాతయ్యకేం చాలుతుందే. కూర్చుంటే కాళ్లెలా పెట్టుకోవాలో దాని మీద" అన్నాడు రవి.

ఓ అరగంట కూర్చున్నాక "ఈ కుర్చీలో కూర్చుంటే మోకాళ్ల నొప్పు లొస్తున్నాయర్రా... లాభంలేదు" అని పైకి లేచారు అవధానిగారు ఓ చేత్తో మోకాళ్లు, ఇంకో చేత్తో నడుము రాసుకుంటూ.

"పదండి... గదిలో మంచంమీద పడుకోండి. తైలం మర్దనా చేస్తాను" అంది సత్యవతమ్మ లేస్తూ.

"అన్నయ్యా! తాతయ్యకి పాపం ఎప్పుడూ దెబ్బలేరా? ఇక మనకి కథలవీ ఎలా చెప్తారు?" ఓ క్షణం నోట్లోవేలు తీసి విచారంగా అంది దీప. "ఓల్డ్ అయిపోయారుగా. ఇంక మనమే తాతయ్యని చూసుకోవాలి" "చూసుకుంటున్నాంగా. పోనీ తాతయ్య గది లోకి పోయి చూస్తూ కూర్చుందామా"



"చూడడమంటే అదికాదు. తాతయ్యకు ఏదైనా కావాలంటే తెచ్చి వ్వడం, తాతయ్యకి కాళ్లు పట్టడం...అలాంటివి."

"అయితే నేనిప్పుడే వెళ్లి తాతయ్యకి కాళ్లు పడతాను. నువ్వేమో నడుం పట్టు. నడుంకి దెబ్బ తగిలిందిగా"

"సరే పద...కొంచెంసేపే... ఒక టెన్‌మినిట్స్. ఆనక బుక్స్ తీద్దాం చదువుకోవడానికి"

***

దీపావళి దగ్గర పడుతోంది. పురుగులు దీపం చుట్టూ తిరుగుతుంటే వాటిని పట్టుకు తింటానికి బల్లులు ఎక్కువవుతున్నాయి. ఇంటి తోటలో పూసిన పూలమీదకి సీతాకోక చిలుకలు వాలుతున్నాయి.


దీపకి పురుగులంటే చీదర. బల్లులంటే తగని భయం. పురుగుల బాధకి లైట్లన్నీ ఆర్పేసారు. ఆ గుడ్డి వెలుతురులో ఏం చేయాలో తోచక



## మహారాణికి డబ్బు కటకట

ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రభావం ఎలిజబెత్ మహారాణికి కూడా తప్పడంలేదు. తమ రాజభవనం బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో గ్యాస్, కరెంటు ధరలు విపరీతంగా పెరిగిపోయాయని వాటిని పొదుపు చేయండని పనివాళ్లకి చెప్పిందిట. అత్యవసరమైతేతప్ప ఫోన్ కూడా ముట్టుకోవడం లేదుట. ఆమె మామూలుగా వైభవంతో ఉండాలంటే ఆమెకయ్యే ఖర్చుల విలువ 32 మిలియన్ పౌండ్లు. కానీ ఆమెకు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నుంచి కేవలం ఏటా 15 మిలియన్ పౌండ్ల భరణం లభిస్తోందిట. చివరికి ఆమె నివాస గృహానికి కొన్నేళ్లుగా రిపేరు కూడా జరిపించుకోలేనంత పేదరికంలో ఉందిట. ఎంత చెట్టుకి అంత గాలి మరి.

-తటవర్తి




బల్లుల్ని చూస్తూ కూర్చున్నారు దీప, రవి. ఇంట్లో వాళ్లిద్దరే ఉన్నారు. కృష్ణ ఇంకా ఇంటికి రాలేదు. వీధి కాంపౌండ్ అరుగుమీద కూర్చున్నారు అవధాన్లుగారు. అత్తగారూ, కోడలూ గుడికి వెళ్లారు.

"వెనక పెరట్లో లైటొదిలివేస్తే పురుగులూ, బల్లులు పోతాయి. అట్లా చేద్దాం" రవి లేచి పెరట్లో లైటు వేసాడు. ఎక్కువ పురుగులు అటు వెళ్తున్నాయి. ఎక్కడ నుంచి వచ్చిందో రంగురంగుల అందాల సీతాకోకచిలుక లోపలకువచ్చి వాలింది. బల్లులు దాని కదలికలను చూస్తున్నాయి.

ఒకేసారి మూడు బల్లులు సీతాకోక చిలుకని వెంట తరిమాయి. అందులో చిన్న బల్లికే సీతాకోక చిలుక దక్కింది. ఎంతసేపో దాన్ని నోట్లో నొక్కి పట్టి వుంచింది చిన్నబల్లి. చివరకు ఒక్కక్షణం దాన్ని పైకి తీసి సరిగ్గా నోట్లోకి తీసుకోబోయింది. పెద్దబల్లి ఆ క్షణం కోసమే ఎదురు చూస్తూ దాన్ని ఎగరేసుకుపోతోంది. దీపా, రవి ఇదంతా చూస్తున్నారు. దీప పరుగున వెళ్లి "తాతయ్యా! పెద్ద బల్లి అందమైన బట్టర్‌ఫ్లైని తినేయడానికి చూస్తోంది. రా...లోపలికి చప్పున" అంటూ తాతయ్య చెయ్యి పట్టి లాక్కొచ్చింది.

"అదిగో అక్కడ చూడు తాతయ్యా... దాన్ని అదిలించు బట్టర్‌ఫ్లై పువ్వులోకి వెళ్లిపోతుంది" అంది దీప,.

"అది దాని ప్రే. దాన్ని మనం డిస్టర్బ్ చేయకూడదు" అన్నాడు రవి. వాడు సెవెంత్ స్టాండర్డ్ చదువుతున్నాడు.

"ప్రే అంటే?" దీప ఇంకా స్టాండర్డ్ వన్ చదువుతోంది.

"బల్లి ఏం తింటుంది. అన్నం పెడితే తింటుందా?"

"ఛీ...బల్లి అన్నం ఎలా తింటుంది. దానికి మనలా హేండ్స్ లేవు. కూర్చోలేదు. అది పురుగులే తింటుంది."

"ప్రే అంటే దాని ఆహారం.నువ్వు అన్నం తిన్నట్లే బల్లి సీతాకోకచిలుకను తింటుంది. బల్లులు పురుగులను తినకపోతే అవి మరీ ఎక్కువై మనల్ని బతకనివ్వవు" అన్నాడు తాతయ్య.

"అన్నయ్యా! తాతయ్య చెప్పే కబుర్లు వింటూ కూర్చుందాం. చెప్పు తాతయ్యా.. ఇంకా కథలు, కబుర్లు చెప్పు" అని తాతయ్య చెయ్యి పట్టుకుని అడిగింది దీప.

"అలా చేయి పట్టుకోకు. తాతయ్యకు నొప్పి పెడుతుంది. అసలే నడుంకి దెబ్బ తగిలింది. తాతయ్య మనం ముగ్గురం సోఫాలో కూర్చుని కథలు, కబుర్లు చెప్పుకుందాం. నీకు మోకాళ్లు నొప్పి పెట్టకుండా నీ కాళ్ల దగ్గర స్టూల్ వేస్తాను" అని లేచాడు రవి.

"నా స్టూలే వేయి అన్నయ్యా.. దాని మీద తాతయ్య కాళ్లు పెట్టుకుని కథలు చెప్తుంటే నేను కాళ్లు పడతాను."

"నువ్వు చెప్పే కథ స్లో అండ్ స్టడీ విన్స్ ద రేస్. ఆ కథ మా లెసెన్ బుక్‌లో వుంది తాతయ్యా" అని అంది దీప.

"అరే... అయితే ఇంకో కథ మీ లెసన్ బుక్‌లోది నువ్వు చెప్పు. నేను వింటా" అన్నారు అవధాన్లుగారు.

"అది వద్దు. భారతంలో కథలు చెప్పు" అన్నాడు రవి.

"అవును తాతయ్యా... నువ్వు కథలు చెప్తే నాకు రాత్రి కృష్ణుడు కలలో వస్తాడు" అంది దీప. భారతంలోని చిన్న కథలు రెండు చెప్పేసరికి తాతయ్యకి నడుం నొప్పి వచ్చింది. సోఫాలోంచి లేచిపోయి నడుం పట్టుకుని 'అబ్బా' అని మూలిగారు అవధానిగారు.

"ఏం తాతయ్యా నడుంనొప్పా... పద నీ గదిలో మంచంమ్మీదకి తీసుకెళ్తాం" రవి, దీపా తాతయ్యని మంచం దగ్గరికి దిగబెట్టారు.

"ఎంతకని పడుకోనే. మంచమ్మీద అస్తమానం పడుకుంటే ఎప్పుడూ లేనిది నాకు నడుం పట్టేస్తోంది. అదీకాక నేను పేపర్లు, పుస్త

కాలు ఎక్కువ చదువుతాను. పడుకుని ఎట్లా చదువుతానే. మామూలు కుర్చీలో కూర్చుంటే నాకు మోకాలి నొప్పులు, నా పడకకుర్చీ నాకు కావాలి. పడకకుర్చీ బట్ట తెచ్చుకు వస్తానుండు'' అప్పుడే వచ్చిన సత్యవతమ్మతో చెప్పి బజారువైపు వెళ్లారు అవధానిగారు. కృష్ణ పనుల్లోపడి పడకకుర్చీ సంగతి మర్చిపోయాడు. ప్రియ ఎప్పుడూ వంటా పిల్లల పనితో తలమునకలై వుంటుంది. సత్యవతమ్మ కూడా "పోనిద్దురూ ఎక్కడ కూర్చున్నా పోయేదానికి ఇంత గొడవెందుకు? అనవసరమైన రభస ఎందుకు?'' అంటుంది. బజారులో అవధానిగారు కొంతదూరం నడిచి వాకబు చేసేసరికి కాళ్లు లాగాయి. ఎక్కువ నడవలేరతను. డెబ్బ య్యావ పడిలో పడ్డారు. తనకి వచ్చిన పెన్షన్‌లో ఒక వెయ్యి మాత్రం తమ ఇద్దరి మందులకని వుంచుకుని మిగతాది కొడుకు చేతికి ఇస్తాడు. ఇవాళా రేపు ధరలవీ ఎలా ఉన్నాయి. రోజురోజుకీ ఖర్చులు, ధరలూ పెరుగుతున్న కాలమిది. అవధాన్లుగారు ఎప్పుడూ నడవడానికే చూస్తారుగానీ రిక్షాగానీ ఆటోగానీ ఎక్కరు. పొదుపులో భాగం, ఎక్సర్‌సైజులోనూ భాగమది. అవధానిగారు బజార్లో తిరిగి వచ్చారు.

"చెప్తే వినరు. ఎందుకీ తిరగడం? నాల్రోజులయ్యాక డిసెంబర్ సెల వులిచ్చి తీరుబాటయ్యాక కృష్ణే దానికి బట్టవేయించి తెస్తాడు. కొంచెం సర్దుకుంటే సరి'' కాళ్లకు తైలం రాస్తూ సత్యవతమ్మ అనునయించింది.

"మోకాలి నొప్పులతోపాటు నడుంనొప్పి కూడానంటే వినవేం'' అంటూ మరో పక్కకి వత్తిగిల్లారు అవధాన్లుగారు.

పక్క గదిలో చదువుకుంటున్న రవికి వాళ్ల మాటలు వినబడ్డాయి.

"తాతయ్యకి పడక కుర్చీ లేక బాధ పడుతున్నాడు. పడకకుర్చీ నేను కొనితేగలిగితే?'' ఆ ఆలోచన రాగానే తనబుక్ రాక్ కేసి నడిచాడు.

బ్యాంక్ పాస్‌బుక్ చేతిలోకి తీసుకున్నాడు. అది తన పాస్‌బుక్. తన ప్రతి పుట్టినరోజుకి నాన్న తనకి వెయ్యి రూపాయలిస్తాడు. అది అప్పుడప్పుడు క్రికెట్‌బ్యాట్ అనీ, బాల్ అనీ, ఫ్రెండ్స్‌కి గిఫ్ట్ అనీ ఖర్చు పెట్టగా ఎంత వుందో చూసాడు. ట్వెల్వ్ హండ్రెడ్ ఉంది. అంటే అందులో టూ వుంచి థౌజండ్ తీసి తాతయ్యకి పడకకుర్చీ కొనవచ్చు

***

శనివారం దీప స్కూలు తొమ్మిదితో అయిపోతుంది. అది వచ్చి అమ్మ పెట్టిన అన్నం తిని సత్యవతమ్మ పక్కన పడుకుంది. స్కూలు నుంచి రవి ఇంకా రాలేదేమని ప్రియ ఎదురుచూస్తూ టీవీ ఆన్ చేసింది.

ఇంతలో రవి వచ్చాడు. "దీపా...దీపా'' అని దాన్ని లేపి వీధి వరండాలోకి తీసుకువెళ్లాడు. అది కళ్లు నులుముకుంటుంటే రవి దాని చెవిలో "దీపా! నేను తాతయ్యకో సర్‌ప్రైజ్ గిఫ్ట్ కొన్నానే. పడకకుర్చీ'' అన్నాడు. దీప నిద్ర ఎగిరిపోయింది. "వ్వావ్! తాతయ్య'' అని అరవబోయింది.

"అరవకు. గోపాల్‌ని కొట్టు మీద వుంచి వచ్చానే. ఇంతా కొన్నాక బండివాడు సిక్స్‌టీ రుపీస్ అడుగుతున్నాడే ఇంటికి తేవడానికి. నీ దగ్గరేమైనా ఉందా?'' అనడిగాడు. దీపకు అప్పుడప్పుడు నాన్న డబ్బులిస్తారు. బాక్సులోంచి తీసి లెక్కపెట్టింది. సిక్స్‌టీఫైవ్. 'హుర్రే' అంటూ రవి సైకిల్ దౌడు తీయించాడు. ఎవరికీ చెప్పవద్దని సైగ చేసాడు.

"తాతయ్యా! నీకో సర్‌ప్రైజ్ గిఫ్ట్'' కేన్ చెయిర్ బండిలోంచి దింపించి వరండా మీద పెట్టాడు.

"ఇదెక్కడిది? నాన్న పంపాడా?''

"నీకు నచ్చిందా లేదా కూర్చుని చూడు తాతయ్యా'' అని తొందర చేసాడు. వాడి మొహం, షర్టు చెమటకు తడిసిపోయాయి. కళ్లు మాత్రం ఆనందంతో మెరుస్తున్నాయి. తాతయ్య పడకకుర్చీలో కూర్చున్నాడు.


అప్పుడే వచ్చిన కృష్ణ 'లోపలికి వస్తూ ఈ దృశ్యం చూసాడు.

"ఏరా పడకకుర్చీ ఎంతయింది? పాతదానికన్నా బాగుంది. ఏ కొట్లో కొన్నావు? దీనిలో కాటన్ పిల్లో కూడా వేసాడు. కంఫర్టబుల్‌గా ఉంది.''

"నేనెక్కడ కొన్నాను? నీ మనవడు నీ కొడుకుకన్నా ప్రయోజకుడు నాన్నా. తాతయ్య అవసరమేమిటో తెలుసుకున్నాడు. నాకు ప్రయారిటీస్ అర్థం చేసుకునే బుర్రలేదు'' అని రవి భుజం తట్టాడు. "నాన్నా! తాతయ్య కష్టపడుతున్నారని నేనూ, దీపా మా సేవింగ్స్‌తో...''

"భయం దేనికి? నేను తాతయ్య ముఖ్య అవసరాన్ని పోస్ట్‌పోన్ చేస్తూ ఆయన్ని కష్టపెట్టాను. మీరు...'' దీపని ముద్దు పెట్టుకున్నాడు కృష్ణ. దీప పరుగెట్టుకుని వెళ్లి తాతయ్య వళ్లో కూర్చుని నోట్లో వేలేసుకుంది. అందరూ నవ్వారు. మనవలకు తనమీదున్న ప్రేమకు తాతయ్య కళ్లు చెమర్చాయి.

★



## మరో 'మాయ'

'మంత్రి' సినిమాలోని 'మహా..మహా..'.పాట ఛార్మికి తెగ పాపులారిటీ తెచ్చింది. ఇంగ్లీషు-తెలుగు భాష కలగలిపిన ఈ పాటకి ఛార్మి సెక్సీ స్టెప్పులు కుర్రప్రేక్షకుల్ని హుషారెక్కించాయి. ఇప్పుడు ఛార్మి 'మాయగాడు'లో కూడా ఇలాంటి 'మాయ' పాట ఒకటి వుందని ఫిలింనగర్ న్యూస్. వేణు హీరోగా నటిస్తున్నప్పటికీ ఈ పాటతో ఛార్మికి మరింత క్రేజ్ రావచ్చుని అంచనాలు వేస్తున్నారు.

